
ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :
శ్రీ ఆనంద్





"స్నేహం చెయ్యడంకోసం మోసం చెయ్యి పరవాలేదు.

మోసం చెయ్యడం కోసం మాత్రం స్నేహం చెయ్యకు- ఇదే ప్రేమకి వర్తిస్తుంది" అని తన ప్రగాఢ విశ్వాసాన్ని ప్రదర్శించిన శ్రీ ఆనంద్ ఇంకా ఏమంటున్నారో వినండి.

"శ్రీ మల్లాది గారు కథల్ని పంపి సెలక్ట్ చెయ్యమన్నప్పుడు ఆనందాశ్చర్యాలు కలిగాయి. జ్యోతి, చతుర, సితార మొదలుకొని ఆంధ్ర ప్రదేశ్‌లో వస్తున్న అన్ని దిన, వార, పక్ష, మాస పత్రికలకి ఎందరెందరో రచయితలు సృష్టించిన విభిన్న పాత్రలకి కుంచెతో రూపురేఖలు దిద్దిన నేను ఉత్తమ కథల్ని ఎంపిక చేయాలనేసరికి ఓ విధమైన కాన్‌సెన్‌ట్రేషన్ నాలో కలిగింది. అదే, ఆకలిని ఆధారంగా చేసుకొని రాసిన కథ 'ఆఖరి ప్రదర్శన', పగతీర్చుకునే కథ ట్రాప్‌ని ఎంపికచేసేలా చేసింది. ఇదంతే మరి కళాకారుడిగా, నటుడిగా (త్వరలో విడుదలకానున్న సినిమాలో) దర్శకుడిగా, కవిగా పలువురి ప్రశంసలనందుకొని అనేక టీ.వి. సీరియల్స్‌కి ఆర్ట్ డైరక్షన్ చేస్తూ, బాలల అకాడమీ వారి పత్రికలో రచయితగా, చిత్రకారుడిగా పని చేస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ ఆనంద్ వెలిబుచ్చిన అభిప్రాయం.

"స్రవంతి ప్రారంభ సంచిక నుంచీ బొమ్మలు వేసే అవకాశంతోపాటు ఈ గెస్ట్ ఎడిటర్‌గా కూడా అవకాశమిచ్చిన మల్లాదిగారికి నా కృతజ్ఞతాభివందనాలు."

# ఆఖరి ప్రదర్శన

జయదేవ్‌కి, 'మెజీషియన్'గా మంచి పేరుంది. నాలుగుపదులు నిండని వయసులోనే, విదేశాల్లో సైతం అద్భుతమైన తన 'ఇంద్రజాల ప్రదర్శన'ల ద్వారా ఎందరో అభిమానుల్ని, శిష్యుల్నికూడా సంపాదించుకున్నాడు.

నగరంలో ఓ 'ఆసుపత్రి' నిర్మాణానికి విరాళాలు సేకరించే నిమిత్తం ముఖ్యమైన నాలుగురోడ్ల 'సెంటర్'లో ఆ రోజు సాయంత్రం అతని ఇంద్రజాలప్రదర్శన ఏర్పాటుచేశారు. ఆ ప్రదర్శనలో 'గ్రేట్ఎస్కేప్'అన్న అంశం ముఖ్యమైనది. ఆరడుగుల చెక్కపెట్టెలో మెజీషియన్ పడుకోగానే, దాన్నిమూసి 'సీళ్ళువేస్తారు' దాన్ని ప్లాస్టిక్‌సంచిలోవుంచి, ఆ సంచిమూతిని తాళ్ళతో గట్టిగా కట్టేస్తారు. ఆ తర్వాత దాన్ని 'క్రేన్' సహాయంతో దాదాపు 'నలభై' అడుగుల ఎత్తున గాలిలో వ్రేలాడదీస్తారు. పదినిముషాల తర్వాత మెజీషియన్, ఆ చెక్కపెట్టెని, ప్లాస్టిక్‌సంచినీ కూడా ఛేదించుకొని బయటకొస్తాడు.

ఈ అంశాన్ని గురించి రకరకాలుగా, భారీ ఎత్తున ప్రచారం చేయడంతో ఆప్రదర్శనచూడ్డానికి జనం విపరీతంగా వచ్చారు.

కార్యక్రమం మొదలైంది. మెజీషియన్ జయదేవ్ 'గ్రేట్ఎస్కేప్' అంశాన్నివిజయవంతంగా ప్రదర్శించాడు. ఆ అద్భుతం చూసిన జనం కొట్టేచప్పట్లశబ్దం సముద్రపుహోరుని గుర్తుకుతెస్తోంది. వెంటనే, అక్కడే ప్రారంభమైంది జయదేవ్ అభినందనసభ. ఇద్దరు రాష్ట్రమంత్రులూ, నగర ప్రముఖులూ జయదేవ్ ప్రతిభని పొగుడుతున్నారు.

ఇంతలో........, ముప్పైయేళ్ళ యువకుడు స్టేజీపైకి దూసుకొచ్చాడు. మంత్రిగారితో ఏదో మాట్లాడి అతని చేతిలోని'మైకు'నితీసుకున్నాడు. "ప్రజలు క్షమించాలి. నేను జయదేవ్‌గారితో పోటీకి రాలేదు. కానీ, నేను నా జీవితాన్ని ధారపోసి నేర్చుకున్న ఓ అద్భుతమైన ప్రదర్శనని మీ ముందు ప్రదర్శించాలని మిమ్మల్నీ, వేదికపై వున్న పెద్దల్నీ ప్రాధేయపడుతున్నాను." అని ఆగాడు. జనంలో కలకలం బయల్దేరింది స్టేజీపైవున్న పెద్దలు మెజీషియన్ జయదేవ్‌తో కాసేపు గుసగుస లాడారు. నవ్వుతూ ఏదో అన్నాడతను వారితో.

'మీరు ప్రదర్శించబోయేదిఇంద్రజాలవిద్యేనా?' అడిగాడొక ఆర్గనైజర్. 'అంతకంటే గొప్పదే,' 'ఈశ్వరజాలం' వినయంగా బదులిచ్చాడా యువకుడు. ఆ సమాధానాన్ని విని ఆశ్చర్యపోయారంతా.

తనపేరు 'వీరేంద్ర' అనీ, తాను ముందుగా లాంటివేమీ వేసుకోననీ, అతి ప్రమాదకరమైన 'విషాన్ని' సైతం తాగగలననీ చెప్పాడు. అర్థమై జట్లు పడ్తున్నారు. జనంమాత్రం చెయ్యండి అంటూ గోలపెడ్తున్నారు. వీరేంద్ర చేసిదింతా ననిపట్టుబట్టడంతో ఆ సభలోనేవున్న కలెక్టరు, జడ్జిగార్ల సమక్షంలో అతను ట్రిక్ చేయబోతున్నట్లూ, ఏమైనాప్రమాదం జరిగితే, అందుకు తానే బాధ్యుణ్ణనీ స్టేట్‌మెంట్ రికార్డ్ చేయించారు. ఓ గ్లాసునిండుగా పాలు, మరోరెండుఖాళీ గ్లాసులు తెప్పించారు వీరేంద్ర కోరికమేరకు. అతని జేబులోంచి 'విషం'వున్న పొట్లాన్నితీసి పరీక్షించుకొమ్మని ఇచ్చారు. పది నిముషాల తర్వాత అదినిజమైన విషమేనని తేల్చారు.

అది ప్రమాదకరమైన విషమనీ, నిర్ణయాన్ని మార్చుకొమ్మనీ చివరిసారిగా నచ్చజెప్ప ప్రయత్నించారు వేదికపైవున్న పెద్దలు. వీరేంద్రపట్టు వదల్లేదు. జనంలోంచి తనస్నేహితుల్ని ఇద్దర్ని వేదికపైకి పిలిచాడు.

'విషంకలిపిన పాలు నేనుతాగుతాను.మిగతా పాలు వాళ్ళు తాగుతారు' అంటూ ప్రకటించాడు వీరేంద్ర. ప్రేక్షకుల చప్పట్లతో ఆ ప్రదేశమంతా మార్మోగింది.

"ఈ గ్లాసులోని పాలను మూడు భాగాలు చేసి ఒకదాంట్లోమాత్రమే అదిగో ఆ పొట్లంలోని విషాన్నికలిపి నాకివ్వండి" చెప్పాడు వీరేంద్ర తన ఇద్దరు స్నేహితులతో. అతను చెప్పినట్లే పాలను మూడు భాగాలుచేసి ఒక గ్లాసులో విషంకలిపి, ఆ గ్లాసుని అతనికిచ్చి మిగతా గ్లాసుల్లోనిపాలు తాగేశారు వీరేంద్ర స్నేహితులిద్దరూ.

వేదికపైవున్న పెద్దలకూ, ప్రేక్షకులకూ చేతులెత్తి నమస్కరించాడు వీరేంద్ర. వెల్లకిలా పడుకుని విషంకలిపిన పాలను గటగట తాగేశాడు. అతను ఎప్పుడు లేస్తాడా' అని ప్రేక్షకులంతా ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

'ఒకటి.... రెండు.... ఐదు.... ఏడు....ఎనిమిది....పది' నిముషాలు గడిచినా ఇంకా లేవక పోయేసరికి కొందరువెళ్ళి అతణ్ణి లేపడానికి ప్రయత్నించారు. నిర్జీవంగావున్న అతని శరీరాన్నిచూసి దిగ్భ్రమచెందారు. వీరేంద్ర ఇద్దరు స్నేహితులు మరీ కంగారు పడుతున్నారు. ఏం జరిగిందో చెప్పమని నిలదీశారు వారిద్దర్నీ.తమకి ఏమీ తెలీదనీ, నేను మ్యాజిక్ చేస్తాను. మీరు నాకు సహకరిస్తే చెరో వందరూపాయలిస్తానని పిలిచాడని చెబుతున్నారిద్దరూ. అక్కడేవున్న ఓ పోలీసు ఆఫీసర్ వీరేంద్ర బట్టల్ని సోదా చేయగా ఓ కవరు కనిపించింది. అందులోని

## స్రవంతి నెం. 19లో ఇచ్చిన

''ఈ గ్లాసులోని పాలను మూడుభాగాలు చేసి ఒకదాంట్లో మాత్రమే అదిగో ఆ పొట్లంలోని విషాన్ని కలిపి నాకివ్వండి'' చెప్పాడు వీరేంద్ర తన ఇద్దరి స్నేహితులతో.

వాక్యం ఆధారంగా రాసిన కథలు

పేపర్ని బయటికి లాగాడతను. అది వీరేంద్ర రాసిన ఉత్తరం.

''మనసున్న మనుషులందరికీ నమస్కారాలు. నన్ను క్షమించండి. నేను పిరికివాడ్ని కాదు. నాకు ఏ ట్రిక్కూ తెలీవు. నేను సైన్సు గ్రాడ్యుయేట్ని. తమ సర్వస్వాన్ని నా చదువుకే వినియోగించిన నా తల్లిదండ్రులకి నేనివ్వగలిగింది 'ఆకలిచావుల్ని' మాత్రమే. అవినీతి, లంచగొండితనం, రికమెండేషన్లు నాకు నిరుద్యోగాన్ని మిగిల్చాయి. నాపై ఆధారపడివున్న ముగ్గురు చెల్లాయిలకి ఒక్కపూటకూడా భోజనం పెట్టలేని స్థితినాది.

'ఇందిరా ప్రజలమధ్య, ప్రముఖులమధ్యన నేను చేసుకుంటున్న ఈ 'ఆత్మహత్య' ఈ ప్రజల్లో సంచలనం, చైతన్యం కలిగించాలనీ; నా చెల్లాయిలకి బ్రతుకుతెరువునీ, నాలాంటి నిరుపేద నిరుద్యోగులకు బ్రతుకుదారినీ చూపించగలిగితే నా ఆత్మకుశాంతి కలుగుతుంది. డబ్బుకోసం నా స్నేహితుల్లా నటించినవారిని నన్ను క్షమించమని ప్రార్థిస్తున్నాను. వాళ్ళకీవిషయంలో ఎలాంటిసంబంధమూలేదు. వాళ్ళనివదిలెయ్యండి''

ఉత్తరం చదవటం పూర్తిచేసిన పోలీసాఫీసరు మౌనంగా ఆ ఉత్తరాన్ని కలెక్టరుగారికి అందించాడు. క్షణాల్లో ఈ విషయం ప్రజలందరికీ తెలిసిపోయింది. మర్నాడీవిషయాన్ని అన్నిపత్రికలూ ప్రముఖంగా ప్రచురించి సంచలనం కలిగించాయి. ఓ పదిరోజులు. ఓ నెల ఈ విషయం గురించి చర్చించుకున్నారు ప్రజలు. అంతే.... తర్వాత అందరూ మరిచిపోయారు ఈ సంఘటన మసగ్గన పడిపోయింది. *

**పవన్,**
కార్టూనిస్ట్
8-150
ప్రకాష్‌నగర్
కడప-516 004.

## "ది ట్రాప్"

వీరేంద్ర మనసు అగ్నిగుండంలా మండిపోతూవుంది.

పగ, ప్రతీకార జ్వాలలు అతని రక్తాన్ని సలసలా ఉడుకెత్తిస్తున్నాయి.

తన భార్య అరుణ మరణం వెనుక అస… నిజాలు ఒక్కొక్కటే తెలుస్తూవుంటే అ… క్యంతో, భయంతో బిగుసుకుపోయాడు …

అరుణను ప్రేమించి పెళ్ళిచేసుకున్నా… వీరేంద్ర. ఎంతో ఆనందంగా సాగిపో… వారి దాంపత్యం. పెళ్ళయి సంవత్స… క్కుండానే ఆత్మహత్య చేసుకొని మ… అరుణ. ఒంటినిండా కిరోసిన్‌పోసి …కొని మరణించింది. ఆ వార్తకు షాక్ తిన్నాడు వీరేంద్ర. అరుణ ఎందుకలాచేసిందో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు వీరేంద్రకు. మనశ్శాంతి కరువై ఒక సంవత్సరంపాటు సెలవుపెట్టి దేశాటన బయలుదేరాడు.

కేదారినాథ్, పండరీపురం, గంగోత్రిలాంటి ఎన్నో పుణ్యక్షేత్రాలు తిరిగి వచ్చాడు.

మరుగునపడ్డ ఎన్నో నిజాలు ఒక్కొక్కటే తెలియసాగాయి వీరేంద్రకు.

అరుణను తన మిత్రులు శేషు, నాగేశం బలవంతంగా మానభంగం చేసారని, ఆ అవమానం భరించలేక, తనకు ముఖం చూపించలేక, మలినమైపోయిన తన శరీరాన్ని అగ్నికి ఆహుతి చేసుకుని పునీత అయిపోయింది. తను క్యాంపుకు వెళ్ళిన అవకాశాన్ని తీసుకుని, తనమిత్రులిద్దరూ త్రాగినమైకంలో, కామపిశాచులై, రాక్షసులై తన భార్య జీవితాన్ని బలితీసుకున్నారు.

పగ!

వాళ్ళమీద కసి తీర్చుకోవాలి. చట్టాలు, న్యాయస్థానాలు లాభంలేదు. తనకి ఆధారాలు లేవు. తను మరణించినా ఫర్వాలేదు. వాళ్ళను ఉరికంబం ఎక్కించాలి. తనకు ఎలాగూ బ్రతుకుమీద తీపిలేదు. అరుణతోనే అన్నీ పోయాయి. వాళ్ళని ఉరికంబం ఎక్కించి తన ప్రతీకారం తీర్చుకోవాలి. అరుణ ఆత్మకు శాంతికలిగించాలి.

ఎంతో ఆలోచించి ఒక పథకాన్ని సిద్ధం చేసాడు వీరేంద్ర!

* * * *

నమ్మలేనట్టుగా వీరేంద్ర వైపు చూశారు శేషు, నాగేశం.

''ఏమిటీ విషాన్ని జీర్ణించుకొనే శక్తి సంపాదించావా?'' అని అడిగారు.

''అవును. మనశ్శాంతి లేకుండా హిమాలయ ప్రాంతాల్లో తిరుగుతూవుండగా ఒక సాధువుతో పరిచయం అయింది. ఆయన దగ్గర ఎన్నో వనమూలికలు వున్నాయి. ఎలాంటి విషాన్నైనా జీర్ణం చేసుకోగల మూలికలను నాతో తినిపించాడు.'' అన్నాడు వీరేంద్రే.

మళ్ళీ తనే అన్నాడు.

''ముందుగా ఈ ప్రయోగాన్ని మీ ముందు నిరూపిస్తాను. ఆ తర్వాత ప్రదర్శనలు యిస్తాను.

''ఇదిగో పాలు. ఈ గ్లాసులోని పాలను మూడు భాగాలుచేసి ఒక దాంట్లో మాత్రమే అదిగో ఆ పొట్లంలోని విషాన్ని కలిపి నా కివ్వండి'' చెప్పాడు వీరేంద్ర తన ఇద్దరి స్నేహితులతో,

శేషు పొట్లాన్ని తీసి విషాన్ని వీరేంద్ర గ్లాసులో కలిపాడు. నాగేశం ఆ గ్లాసును తీసి వీరేంద్రకు అందించాడు.

పొట్లంమీద, గ్లాసుమీద మిత్రులిద్దరి వేలిముద్రలు పడినవని తెలిసి గ్లాసు అందుకొని గడగడా తాగేశాడు వీరేంద్ర.

''రేపు ఉదయం నేను వచ్చి మీ యిద్దరికీ గుడ్ మార్నింగ్ చెపుతాను. వెళ్ళిరండి'' అని మిత్రులను సాగనంపాడు.

ఆ తర్వాత చకచకా పనులు ప్రారంభించాడు.

ఒక ఉత్తరం వ్రాసిపెట్టాడు.

''తన భార్య మరణానికి కారణం తన మిత్రులేనని తనకి తెలిసిందని, తనను కూడా హతమార్చడానికి మిత్రులిద్దరూ ప్రయత్నిస్తున్నారని, ఏ క్షణంలోనైనా తన ప్రాణాలు వారి చేతిలో పోవచ్చని'' పోలీసులకు లేఖ వ్రాశాడు.

మంచం మీద పడుకొని అరుణ ఫోటోవైపు చూస్తూ తృప్తిగా ఆమె వైపు చూస్తూ శాశ్వత నిద్రలోకి జారుకున్నాడు వీరేంద్ర.

వీరేంద్ర లేఖ, వేలిముద్రల ఆధారంగా శేషు, నాగేశంలను అరెస్టుచేశారు పోలీసులు.

కోర్టు వారికి ఉరిశిక్ష విధించింది.

స్వర్గంలో వీరేంద్ర ఆత్మ తృప్తిగా నవ్వుకుంది. *

**-ఇ.టి. రామారావు**
పర్చేస్ అసిస్టెంట్
ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్,
శ్రీహరికోట-524 124

### ఓ కథ రాయండి

**ఈ క్రింది ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.**

"ఏమిటి, మీపెళ్ళికి ముందు నీభర్త అవిటివాడని నీకుతెలీదా?" ఆశ్చర్యంగా అడిగింది భారతి తన ఫ్రెండ్ పూర్ణని.